క్లుప్తంగా

ప్రణాళికతో చదివితే విజయం

దుమ్ముగూడెం: పదో తరగతి విద్యార్థులు రాబోవు 58 రోజులు ప్రణాళికతో చదివితే విజయం తథ్యమని హెచ్ఎం బెక్కంటి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం మండలంలోని నర్సాపురం గ్రామంలోని సూదిరెడ్డి నాగిరెడ్డి ఆదిలక్ష్మమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్చిలో జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షల దృష్ట్యా ఈ రెండు నెలలు విద్యార్థులపై ప్రత్యేకమైన శ్రద్ధ వహించాలని, ఇంటి వద్ద పిల్లల చదువుకునే వసతులు, సౌకర్యాలు కల్పించాలని కోరారు. ముఖ్యంగా సెల్ ఫోన్లకు దూరంగా ఉంచాలని, ఉదయాన్నే నిద్రలేపాలని సూచించారు. ప్రతిరోజూ ఉపాధ్యాయులు ఉదయమే ఫోన్ చేసి విద్యార్థులు చదువుతున్నారో లేదో తెలుసుకుంటారని వివరించారు. ఉపాధ్యాయులు కృష్ణ, బుర్రయ్య, చిలకమర్రి శ్రీనివాస్, రమణ, స్వామి, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

వాహనాలకు రేడియం స్టిక్కర్లు

అశ్వారావుపేటరూరల్: జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా మంగళవారం రాత్రి అశ్వారావుపేట పోలీసుల ఆధ్వర్యంలో వివిధ వాహనాలకు రోడ్డు ప్రమాదాల నివారణకు రేడియం స్టిక్కర్లు వేయించారు. స్థానిక భద్రాచలం మార్గంలోని ఫంక్షన్ హాల్ వద్ద రాకపోకలు సాగించే ట్రాక్టర్లు, ఇతర వాహనాలను సీఐ కరుణాకర్, ఎస్సై టి.యయాతి రాజు ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో రేడియం స్టిక్కర్లు లేని వాహనాలను గుర్తించి, అక్కడికక్కడే వాటికి స్టిక్కర్లు వేయించి అవగాహన కల్పించారు. అలాగే మాసోత్సవాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

కమిటీల ఏర్పాటుపై దృష్టి

ములకలపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడైనా రావొచ్చనే ప్రచారంతో కాంగ్రెస్ నాయకులు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా గ్రామస్థాయి కమిటీల నియామకంపై దృష్టి సారించారు. మండలంలో 20గ్రామ పంచాయతీలు ఉండగా, ములకలపల్లి అధ్యక్ష, కార్యదర్శులుగా పువ్వాల మంగపతి, గాడి తిరుపతిరెడ్డితో కమిటీని ప్రకటించారు. మిగతా గ్రామాల్లోనూ కమిటీల నియామకానికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్ రావు, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి ఆధ్వర్యాన ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో విజయానికి కృషి చేసేలా మూడు రోజుల్లో అన్ని గ్రామ కమిటీలను నియమిస్తామని ప్రభాకర్ తెలిపారు.

పూసుగూడెం జీపీ అధ్యక్షుడిగా పత్తీలాల్

కాంగ్రెస్ పార్టీ పూసుగూడెం గ్రామపంచాయతీ అధ్యక్షుడిగా భూక్యా పత్తీలాల్, కార్యదర్శిగా పద్దం వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. మంగళవారం ఏర్పాటు చేసిన పార్టీ సమావేశంలో జీపీ నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్ష, కార్యదర్శులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి దుశ్శాలువతో సత్కరించారు.

సామాజిక కార్యకర్తకు సన్మానం

మణుగూరుటౌన్: ఏరియా సామాజిక కార్యకర్త నాగుల జ్యోతి ఇటీవల జ్యోతిబాపూలే రాష్ట్ర స్థాయి మహిళా ప్రతిభ పురస్కారం అందుకున్న నేపథ్యంలో మంగళవారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రజాభవన్‌లో గ్రహీతను ఘనంగా శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాగుల జ్యోతి సత్యార్థి ఫౌండేషన్ ద్వారా బాల్యవివాహాల వ్యతిరేకంగా పనిచేస్తూ.. ప్రజల్లో అవగాహన పెంచుతూ.. అధికారుల, ప్రజల ప్రశంసలు అందుకుంటోందని కొనియాడారు. సింగరేణి సేవా సమితి సభ్యులు నాజర్‌పాషా, ఐఎన్‌టీయూసీ నాయకులు వత్సవాయి కృష్ణంరాజు, మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, బల్లెం సురేశ్, మంగీలాల్, సుబ్బారెడ్డి, జీవరత్నం, గణేశ్, జ్యోతి బంధువులు పాల్గొన్నారు.

గ్రామ కమిటీ ఏకగ్రీవం

దమ్మపేట: దమ్మపేట గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం రాత్రి దమ్మపేటలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా చిన్నశెట్టి చిట్టిబాబు, ప్రధాన కార్యదర్శిగా తాళ్ల శంకర్, ఉపాధ్యక్షుడిగా చాట్ల శ్రీనివాసరావు, కోశాధికారిగా వేముల శ్రీను, సంయుక్త కార్యదర్శిగా కొయ్యల ప్రసాద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన కమిటీ సభ్యులకు కాంగ్రెస్ నాయకులు అభినందనలు తెలిపారు.

రుణాల చెల్లింపులు వేగవంతం చేయండి

చండ్రుగొండ: స్వయం సహాయక గ్రూపులకు చెందిన రుణాల చెల్లింపులు త్వరితగతిన చెల్లించేలా చూడాలని తెలంగాణ గ్రామీణబ్యాంకు బ్రాంచ్ మేనేజర్ ఏ.వెంకటరవికుమార్ కోరారు. బ్యాంకులో బ్యాంకుమిత్రలు, ఐకేపీ సీసీలు, గ్రామదీపికలతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. రుణాల వసూళ్లపై వారికి దిశానిర్దేశం చేశారు. ఫీల్డ్‌ఆఫీసర్లు యాదగిరి, శ్రీలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపిక ప్రక్రియ ఆరంభం

- నిర్ణీత పల్లెల్లో గ్రామసభలు
- పథకాలకు అర్హుల జాబితా వెల్లడి
- పలుచోట్ల పేర్లు లేకపోవడంపై స్థానికుల నిలదీత



ములకలపల్లి: పూసుగూడెం గ్రామసభలో తహసీల్దార్‌తో వాగ్వాదం చేస్తున్న స్థానికులు



మణుగూరుటౌన్: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు మంగళవారం లబ్ధిదారుల ఎంపిక మొదలైంది. ఇందులో భాగంగా నిర్ణయించిన తేదీల ప్రకారం ఆయా గ్రామాల్లో గ్రామసభలు ఏర్పాటు చేసి, ఎంపికైన అభ్యర్థుల పేర్లను వెల్లడి చేశారు. కొన్నిచోట్ల లిస్టులో తమ పేరులేకపోవడంపై లబ్ధిదారులు అసంతృప్తిని వ్యక్తం చేశారు.

దమ్మపేట: మండలంలోని కొమ్ముగూడెం, బాలరాజుగూడెం, మొండివర్రె, శ్రీరాంపురం, గణేష్‌పాడు, గున్నేపల్లి, సీతారాంపురం, ఆర్లపెంట, పూసుకుంట, తాటిసుబ్బన్నగూడెం గ్రామాల్లో సభలు నిర్వహించగా.. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ హాజరయ్యారు. అల్లిపల్లి, వడ్లగూడెం గ్రామాల్లో లబ్ధిదారులు జాబితాలో తమపేర్లు లేవని అభ్యంతరాలు వ్యక్తం చేశారు.

మణుగూరుటౌన్: మండలంలోని దమ్మక్కపేట, లంకమల్లారం, గుట్టమల్లారం, ముత్యాలమ్మనగర్, పట్టణంలోని బాపనకుంట గ్రామాల్లో జరిగాయి. సభలకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్‌తో కలిసి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హాజరయ్యారు. సమావేశాలను తహసీల్దార్ రాఘవరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ వెంకటేశ్వర్లు, పట్టణంలో కమిషనర్ యాదగిరి పర్యవేక్షించారు.

దుమ్ముగూడెం: మండలంలోని 12 గ్రామ పంచాయతీలలో గ్రామ సభలను నిర్వహించారు. వీటిల్లోని తూరుబాక, లక్ష్మీనగరం గ్రామసభల్లో స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు పాల్గొన్నారు. లక్ష్మీనగరం, నర్సాపురం, రేగుబల్లి, గంగోలు పంచాయతీ సభల్లో ప్రభుత్వ పథకాలు అర్హులకు అందలేదని ప్రజలు అసంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్, తహసీల్దార్ మామిడి అశోక్‌కుమార్, ఏఓ నవీన్‌కుమార్, ఎంపీఓ రామకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉపేంద్ర, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది, ఐకేపీ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట మండలంలోని దిబ్బగూడెం, గుర్రాల చెరువు, జమ్మిగూడెం, మద్దికొండ, మొద్దులమడ, పాత అల్లిగూడెం, వేదాంతపురం, కేశప్పగూడెం గ్రామ పంచాయతీల్లో ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. కాగా, గుర్రాల చెరువు పంచాయతీలో అర్హత ఉన్న వారి పేర్లు ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో లేకపోవడంతో గ్రామస్తులు అధికారులను నిలదీశారు. కేశప్పగూడెం పంచాయతీలో గతంలో డబుల్ ఇళ్లు కేటాయించిన వారికి మళ్లీ ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో పేర్లు ఉండటంపై గిరిజనులు అధికారులతో వాగ్వాదపడ్డారు. ఆయా పేర్లు తొలగిస్తామని అధికారులు ప్రకటించడంతో వివాదం సద్దుమనిగింది. మరోవైపు, తొలి రోజు జరిగిన గ్రామసభల్లో కనీసం ఫ్లెక్సీలు కూడా ఏర్పాటు చేయలేదు. ఒకటి, రెండు చోట్ల ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం, స్థానిక ఎమ్మెల్యే ఫొటోలు కూడా లేకపోవడంతో విమర్శలు వినిపించాయి. సభల్లో మండల ప్రత్యేకాధికారి డాక్టర్ ప్రదీప్ కుమార్, తహసీల్దార్ వనం కృష్ణ ప్రసాద్, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, ఏఓ పోలిమేర శివరాం ప్రసాద్, ఎంపీఓ సోయం ప్రసాద్, కార్యదర్శులు, ఏఈఓలు పాల్గొన్నారు.



పినపాక: జాబితాలో తమ పేర్లు లేవని అధికారులను నిలదీస్తున్న కోట్లపల్లి గ్రామస్తులు

బూర్గంపాడు: మండలంలోని ముసలిమడుగు, వేపలగడ్డ, కోయగూడెం,సోంపల్లి, తాళ్లగొమ్మూరు, పినపాక పట్టీనగర్ గ్రామాల్లో అధికారులు గ్రామసభలు నిర్వహించారు. ఈ సభల్లో కొత్తగా 465 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఆయా గ్రామసభలలో తహసీల్దార్ ముజాహిద్, మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరెడ్డి, ఎంపీడీఓ జమలారెడ్డి, ఎంఏఓ శంకర్, మండల అధికారులు గ్రామపంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

పినపాక: మండల పరిధిలోని పలు పంచాయతీలో గ్రామసభలు నిర్వహించారు. కోట్లపల్లి పంచాయతీ గ్రామసభలో తమ పేర్లను ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇల్లు జాబితాలో నుంచి తొలగించారని తహసీల్దార్ ఎదుట లబ్దిదారులు వాపోయారు. అధికారులను నిలదీశారు.

ములకలపల్లి: మండపరిధిలోని తిమ్మంపేట, పూసుగూడెం, పాతగంగారంతోపాటు మొత్తం ఏడు జీపీ కేంద్రాల్లో మంగవారం గ్రామసభలు నిర్వహించారు. జీపీ కార్యదర్శులు నివేదిక చదివి వినిపించగా, పలువురు ప్రతిఘటించారు. పాతగంగారం, పూసుగూడెం సభల్లో అధికారులతో వాగ్వివాదానికి దిగారు. అధికార పార్టీలకు చెందిన వారికే పథకాలు ఇచ్చారని ఆరోపించారు. తహసీల్దార్ గుడ్ల పుల్లారావు, ఎంపీడీఓ రేవతి, ఎంపీఓ లక్ష్మయ్య, హౌసింగ్ డీఈ సుబ్రమణ్యం, ఏఓ అరుణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురం: మండల పరిధిలోని మనుబోతులపాడు, ఎలకలగూడెం, సంద్రలబోడు, సీతారాంపురం, గొందిగూడెం కొత్తూరు, చింతిర్యాల, తురంవారిగూడెం, బట్టీలగుంపు గ్రామ పంచాయతీలలో మంగళవారం గ్రామ సభలు నిర్వహించారు. తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీడీఓ వరప్రసాద్, ఎంపీఓ ముత్యాలరావు, ఏఓ సాయిశంతన్‌కుమార్, ఆర్ఐలు రాజేశ్వరరావు, కాంతయ్య, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.



అశ్వారావుపేటరూరల్: గుర్రాల చెరువు పంచాయతీ సభలో వాగ్వాదం..



దుమ్ముగూడెం: లక్ష్మీనగరం గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

కరకగూడెం: మండల పరిధిలోని కొత్తగూడెం, చోప్పాల, కన్నాయిగూడెం, తుమ్మలగూడెం, వెంకటాపురం, తాటిగూడెం గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించారు. ప్రజాపాలనలో సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి గ్రామసభలో సమర్పించారు. పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

గుండాల: గుండాల, ఆళ్లపల్లి మండలాల్లోని లింగగూడెం, రోళ్ళగడ్డ, చెట్టుపల్లి చెంబూనిగూడెం, అడవిరామారం, దొంగ తోగు, బోడాయికుంట, నడిమిగూడెం గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించారు. గుండాల, ఆళ్లపల్లి మండలాల ప్రత్యేక అధికారులు ఖుర్షీద్, కోటేశ్వరరావు, తహసీల్దార్లు ఇమ్మానుయేల్, శకుంతల, ఎంపీడీఓలు సత్యనారాయణ, శ్రీనివాస్ ఎంపీఓ శ్యాంసుందర్ రెడ్డి, ఆయా జీపీల కార్యదర్శులు పాల్గొన్నారు.

చర్ల: మండలంలో కొనసాగుతున్న గ్రామసభల్లో కొయ్యూరులో ఏర్పాటు చేసిన సభలో స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు పాల్గొన్నారు. తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ ఈదయ్య, ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రాజకీయ జోక్యం తగదు

చండ్రుగొండ: ప్రభుత్వ సంక్షేమ పథకాల అమల్లో రాజకీయ జోక్యం తగదని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు అన్నారు. మండలకేంద్రం చండ్రుగొండలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి నిబంధనలూ లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు అన్నవరపు కనకయ్య, కె.పుల్లయ్య, కొండపల్లి శ్రీధర్, పెద్దిని వేణు, ఐలూరి రామిరెడ్డి, ఆర్.వెంకటాచారి, కాక సీత, ఎస్‌కె.నాగుల్‌మీరా, విప్పర్ల వెంకటేశ్వర్లు వీరభద్రం పాల్గొన్నారు.

మండల స్థాయి వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలోని విద్యావనరుల కేంద్రంలో జనవరి 25న జాతీయ ఓటర్స్ దినోత్సవం సందర్భంగా మండల స్థాయిలో విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, వక్తృత్వ పోటీలు మంగళవారం నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానం వచ్చిన విద్యార్థులను నేడు భద్రాచలం నియోజకవర్గ స్థాయి పోటీలకు పంపనున్నట్లు ఎంఈఓ సున్నం సమ్మయ్య తెలిపారు. విజయవంతంగా సాగిన ఈ కార్యక్రమంలో పర్ణశాల ఇన్‌చార్జ్ ఎంఆర్‌సీ, ఏజే ప్రభాకర్, ఉపాధ్యాయులు, శ్రీధర్, రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

సోలార్ గ్రామంగా తీర్చిదిద్దుతాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

దమ్మపేట: తన స్వగ్రామమైన గండుగులపల్లిని సంపూర్ణ సోలార్ గ్రామంగా తీర్చిదిద్దుతానని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మంగళవారం అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, దమ్మపేట మండల పరిధిలోని గండుగులపల్లి గ్రామంను, మోడల్ సోలార్ విలేజ్‌గా ఎంపిక చేసిన సందర్భంగా గ్రామంలో నిర్వహించిన సభలో ఎమ్మెల్యే జారే మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సహకారంతో గండుగులపల్లి గ్రామం, ఉచిత సోలార్ పైలెట్ ప్రాజెక్టుకు ఎంపికైందని తెలిపారు. గ్రామంలో మొత్తం 387 మంది గృహ వినియోగదారులు, 256 వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు ఉచితంగా సోలార్ ప్లాంట్‌లను నిర్మించి, ఇవ్వనున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్టు విజయవంతమైన తర్వాత రానున్న రోజుల్లో మరికొన్ని గ్రామాలకు కూడా ఈ ప్రాజెక్టును విస్తరింపజేయున్నట్టుగా వెల్లడించారు. అనంతరం అదే సభలో సోలార్ ప్లాంట్, దాని ఉపయోగాలు తదితర అంశాల గూర్చి కోయ భాషలో స్థానిక గిరిజన యువతి కుంజా అరుణ గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ మహేందర్, డీఈ నందయ్య, ఏడీఈ వెంకటరత్నం, ఏఈ సాయికిరణ్, జేఈ వెంకట్, కాంగ్రెస్ నాయకులు సోయం ప్రసాద్, తుమ్మల శేషుబాబు, చిన్నశెట్టి యుగంధర్, కాసాని నాగప్రసాద్, ఎర్రా వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

టీబీ వ్యాధిపై అవగాహన ఉండాలి

అశ్వారావుపేటరూరల్: ప్రతి ఒక్కరూ టీబీ వ్యాధి, లక్షణాలు, నివారణపై అవగాహన కలిగి ఉండాలని వినాయకపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాందాస్ నాయక్ అన్నారు.

మంగళవారం అశ్వారావుపేటలోని సబ్ సెంటర్–2లో గ్రామస్తులకు టీబీ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దగ్గు ఒక్కటే టీబీ లక్షణం కాదని, సరైన పరీక్షలు చేయిస్తేనే వ్యాధి నిర్ధారణ సాధ్యమన్నారు. వ్యాధితో బాధపడే వారు సరైన పోషకాహారాన్ని క్రమంతప్పకుండా తీసుకోవడం ద్వారా నియంత్రించే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌వీ దుర్గమ్మ, ఎంఎల్‌హెచ్ ప్రవంతి, సిబ్బంది బేబి, ప్రసాద్, రిజ్వాన్, ఏఎన్ఎం సుజాత పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి రాందాస్ నాయక్

ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారు..

మణుగూరుటౌన్: గ్రామసభల దరఖాస్తులు, సర్వేల పేరుతో ప్రజలని పక్కదారి పట్టిస్తున్నారని సీపీఎం మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావు అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 26 నుంచి ఆరు పథకాలు పూర్తి స్థాయిలో అమలు చేస్తానని చెబుతూ గతంలో ప్రజాపాలనలో పెట్టుకున్న దరఖాస్తుల గురించి ఊసే లేదన్నారు. అర్హుల లిస్టు ఎంపికలో అధికారులు పూర్తి వైఫల్యం చెందుతున్నారని విమర్శించారు. దరఖాస్తులను పూర్తి వివరాలు సేకరించి షరతులు లేకుండా రేషన్‌కార్డులు, మహిళలకు రూ.12వేలు, ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కొడిశాల రాములు, దామళ్లలెనిన్‌బాబు, అల్లె సుధాకర్, ఆర్.శ్రీను, సాంబయ్య, జగదీష్, రమేశ్, నాగేశ్వరరావు, కిషన్ తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ బలోపేతానికి శ్రమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

మణుగూరురూరల్: గ్రామస్థాయిలో బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి ప్రతీ కార్యకర్తా సైనికుల్లా శ్రమించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పిలుపునిచ్చారు. మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయతీ అశోక్‌నగర్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్‌కు స్థానికంగా బలం ఉందని, భవిష్యత్తులో జరిగే ఏ ఎన్నికల్లోనైనా పార్టీ అభ్యర్థులు విజయం సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించి.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపుకు శక్తివంచన లేకుండా పని చేయాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు కుర్రి నాగేశ్వరరావు, కుంటా లక్ష్మణ్, మాజీ జెడ్పీటీసీ పోశం నర్సింహారావు, కోకన్వీనర్లు బొలిశెట్టి నవీన్, నూకారపు రమేష్, నాయకులు వట్టం రాంబాబు, ముద్దంగుల కృష్ణ, అక్కి నర్సింహారావు, ఆవుల నర్సింహారావు, ఎడవల్లి వెంకటయ్య మాజీ ఎంపీటీసీ బేగ రమ్య, ఎం.ప్రసాద్, బి.నరసింహారావు, వెంకటసోములు, కె.ఉపేంద్ర, బి.బీరమ్మ, నరేష్, నరేందర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

మణుగూరుటౌన్: మణుగూరు మండల ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పిండిగ వెంకట్, కార్యదర్శిగా మారుతి శ్రీనివాస్, కోశాధికారిగా సాబీర్‌పాషా ఎన్నికయ్యారు. అలాగే, ఉపాధ్యక్షులుగా దాసరి వెంకట్, నాదెళ్ల సతీష్, గౌరవ అధ్యక్షుడిగా ఈరెల్లి కిశోర్, దామల్ల వెంకన్నతో పాటు మరో 15 మంది సభ్యులను ప్రకటించారు. నూతన కమిటీకి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మంగళవారం శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. అలాగే, అధ్యక్షుడు వెంకట్‌ను మణుగూరు నేతాజీ సుభాష్ చంద్రబోస్ మైదానంలో వాకర్లు సన్మానించగా విజయభాస్కర్‌రెడ్డి, సామా శ్రీనివాసరెడ్డి, తాళ్లపల్లి యాదగిరిగౌడ్, రావులపల్లి రామ్మూర్తి, వడ్లాణం రమేశ్, జొన్నలగడ్డ వెంకటేశ్వరరావు, దొబ్బల శేషగిరిరావు పాల్గొన్నారు.

అంతిమ సంస్కారానికి సాయం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన పోలుమూరి నాగలక్ష్మి అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న టీడీపీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ కట్రం స్వామిదొర ఆధ్వర్యంలో మృతురాలి అంతిమ సంస్కారానికి పార్టీ ద్వారా రూ.10వేల నగదు ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎన్.శ్రీను, గ్రామపెద్దలు చందా లక్ష్మీనర్సయ్య ఉన్నారు.

బీఆర్ఎస్ నూతన కమిటీ ఎన్నిక

మణుగూరురూరల్: మండల పరిధిలోని తోగ్గూడెం గ్రామపంచాయతీలో మంగళవారం బీఆర్ఎస్ శాఖ సమావేశం జరిగింది. అనంతరం గ్రామపంచాయతీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అడబాల సత్యవతి, ఉపాధ్యక్షుడిగా నాగుల సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా గోవింద శ్రీను, సహాయ కార్యదర్శిగా సచ్చు మార్కండేయ, కోశాధికారిగా పాయం రామకృష్ణలతో పాటు 14మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ములకలపల్లి: మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎండి.యూసఫ్ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని విద్యావనరుల కేంద్రం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించి, స్థానిక సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల హామీల మేరకు మధ్యాహ్న వర్కర్లకు వేతనాలు ఇవ్వాలని, పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘ జిల్లా అధ్యక్షురాలు దాసుల పుష్పావతి, మద్దెల పద్మ, అలుగుల శారద, శనగవరపు లలిత, నల్లి భాగ్యమ్మ, ఉష, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సీఐగా బాధ్యతలు స్వీకరించిన రమేష్



ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఐ రమేష్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం టౌన్ సీఐగా బరపాటి రమేష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత శ్రీసీతారామచంద్ర స్వామి వారిని దర్శించుకున్న ఆయన ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈమేరకు సీఐ మాట్లాడుతూ ఫ్రెండ్లీ పోలీసింగ్ కొనసాగిస్తూనే శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. నిషేధిత వస్తువుల రవాణా, విక్రయాలు, అసాంఘిక కార్యకలాపాల సమాచారాన్ని తెలియచేయాలని సూచించారు. కాగా, ఇక్కడ సీఐగా పనిచేస్తూ బదిలీ అయిన సంజీవరావు ఉత్తర్వులను నిలిపివేయించుకునేలా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. గతంలోనూ రెండుసార్లు ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ రద్దు చేయించుకుని భద్రాచలం సీఐగా కొనసాగారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల వ్యవస్థాపక ఉపాధ్యాయుడు, దివంగత తిప్పారెడ్డి నారాయణరెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం పాఠశాలలో మణుగూరు నేత్రాలయ ఐకేర్ అండ్ ఆప్టికల్స్, శ్రీరామచంద్ర మిషన్ (హార్ట్‌ఫుల్‌నెస్) సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొండవీటి గోపి, నారాయణరెడ్డి కుమారుడు విజయభాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడారు. శిబిరంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాటు మల్లెలమడుగు, మొండికుంట గ్రామాలకు చెందిన 150 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ కో ఆప్షన్ సభ్యుడు కమటం వెంకన్న, హార్ట్‌ఫుల్ నెస్ కో ఆర్డినేటర్ బాలకృష్ణ, సభ్యులు వల్లభరావు, యానాల నిర్మల, మల్లారెడ్డి, కమటం లక్ష్మి, అంజయ్య, నేత్రాలయ వైద్య సిబ్బంది నవదీప్, శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ప్రమాదకరంగా డ్రెయినేజీ నిర్మాణం

- నత్తనడకన సాగుతున్న నిర్మాణ పనులు
- ఫలితంగా వాహనదారుల ఇక్కట్లు

అశ్వారావుపేట: అశ్వారావుపేట మండల కేంద్రంలోని జాతీయ రహదారికి ఇరువైపులా డ్రెయినేజీ నిర్మాణం జరుగుతోంది. ఏడాది కాలంగా నత్తనడకన సాగుతున్న అశ్వారావుపేట సుందరీకరణలో ఓ భాగం ఈ డ్రెయినేజీ నిర్మాణ పనులు. ఖమ్మం రోడ్‌లో మీసేవ కేంద్రం సమీపంలో ప్రమాదాలకు నిలయమైన ఓ కల్వర్టు ఉంది. అక్కడ జరిగిన పలు ప్రమాదాల్లో పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారు. వ్యవసాయ కళాశాల నుంచి పల్లంగా ఉండటంతో వాహనాల వేగంతో అదుపు తప్పుతుందేవి. ఇదే విధంగా రాజమండ్రి రోడ్‌లోని సాయిబాబా ఆలయం దాటిన తర్వాత కూడా వాలుగా రహదారి ఉంటుంది. ఇక్కడా వాహనాలు అదుపు తప్పిన సందర్భాలు చాలానే ఉన్నాయి. ఈరెండు చోట్ల జాతీయ రహదారికి కల్వర్టులు ఉన్నాయి. కానీ ఆర్అండ్‌బీ పరిధి 100 అడుగులకు డ్రెయినేజీని నిర్మించడంతో బీటీ రహదారికి సుమారు 15 అడుగుల దూరాన కొత్త డ్రెయినేజీ నిర్మాణం జరుగుతోంది. కానీ ఈ 15 అడుగులకు కల్వర్టును విస్తరించకుండా దూరంగా డ్రెయినేజీని నిర్మిస్తూ మధ్యలో భాగాన్ని వదిలేశారు.

ఖమ్మం రోడ్‌లోని కల్వర్టుకు డ్రెయినేజీని వెడల్పు చేసి ప్రమాదకరంగా వదిలేశారు. రాత్రి వేళల్లో వాహనాలను పార్కింగ్ చేసేందుకు ఆదమరిస్తే అంతే సంగతులు. ఖమ్మం రోడ్‌లోని కల్వర్టు సమీపంలో రెస్టారెంట్‌లు, దాబాలు ఉండటంతో నిత్యం వాహనాలు పార్కింగ్ చేస్తుంటారు. రాజమండ్రి రోడ్‌లో కల్వర్టు వద్ద ఆలయాలు, పంచర్ షాపు, బెల్టు షాపులున్నాయి. ఇక్కడా వాహనాలు ఆగుతుంటాయి. ప్రమాదాలు జరుగకముందే కల్వర్టులు నిర్మించాల్సిన అవసరం ఉంది. ఈవిషయాన్ని ఆర్అండ్‌బీ ఏఈఈ రామిశెట్టి శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లగా ఎస్టిమేట్ చేసేటపుడు కేవలం డ్రెయిను మాత్రమే చేశామని. తర్వాత రోడ్డు విస్తరణ పనుల్లో కల్వర్టు విస్తరణ నమోదు చేస్తామన్నారు.



ఖమ్మం రోడ్‌లో జాతీయ రహదారికి ఇరువైపులా విస్తరణకు నోచుకోని కల్వర్టు



ప్రమాదకరంగా రాజమండ్రి రోడ్‌లోని కల్వర్టు ప్రదేశం..